సాక్షి
కుమురం భీం


ఆదివారం : 26 : మే : 2024



అప్ అండ్ డౌన్ కొలువులు

జిల్లాలో పలువురు ఉద్యోగులు, సిబ్బంది స్థానికంగా ఉండడం లేదు. పట్టణాల నుంచి వస్తూ వేళకు విధులకు హాజరు కాకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. 9లో▸

కలగా భగీరథ జలం



మిషన్ భగీరథ కింద రూ.కోట్లు వెచ్చించి ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చారు. కానీ.. అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. 9లో▸

గరిష్టం/కనిష్టం
41.0 /31.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేడి పెరిగి ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో శంకర్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో శంకర్ తెలిపారు. ఉదయం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 319 మంది విద్యార్థులకు 319 మంది హాజరు కాగా, ఏడుగురు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 308 మంది విద్యార్థులకు 302 మంది హాజరు కాగా, ఆరుగురు పరీక్ష రాయలేదు. ఒకేషనల్ విభాగంలో 11మంది విద్యార్థులకు గాను 10మంది హాజరు కాగా, ఒక్కరు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెకండ్ ఇయర్ పరీక్షకు 560 మంది విద్యార్థులకు గాను 532 మంది హాజరు కాగా, 28మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 518 మందికి 494 మంది హాజరు కాగా, 24 మంది పరీక్ష రాయలేదు. ఒకేషనల్ విభాగంలో 42 మందికి 38 మంది విద్యార్థులు హాజరు కాగా, నలుగురు గైర్హాజరయ్యారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ 25వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక హోమాలు, అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం మహిళలు సామూహిక లలిత సహస్రనామ పారాయణం చేశారు. పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. సిద్దిపేటకు చెందిన ముదిగొండ నాగరాజుశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు హోమంలో పాల్గొన్నారు. సీనియర్ సివిల్ జడ్జి యువరాజ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం వాసవీమాత ఉత్సవ విగ్రహాలతో పట్టణంలోని పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అర్చకుడు ముదిగొండ రాజశేఖరశర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు తాటిపెల్లి దిలీప్, గుండ ప్రమోద్, చిలువేరు వెంకన్న, బోనగిరి మురళీధర్, ఏకిరాల శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరీక్షాకేంద్రం తనిఖీ



కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తిరుమలాదేవి

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న డిగ్రీ పరీక్షాకేంద్రాన్ని శనివారం కేయూ అడిషనల్ కంట్రోలర్ తిరుమలాదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతులు పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరుతెన్నులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కేంద్రంలో అన్ని వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ జాకీర్ ఉస్మాని, అబ్జర్వర్ డాక్టర్ కాంపెల్లి శంకర్, ఇన్విజిలేటర్లున్నారు.

5లోపు యూనిఫాంలు సరఫరా చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: జూన్ 5వ తేదీలోపు పాఠశాలలకు యూనిఫాంలు సరఫరా చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నందున జూన్ 5వ తేదీన యూనిఫాంలు అందించేలా ఏపీఎం, సీసీలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యూనిఫాంలు కుట్టేందుకు జిల్లాలో 78 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా వారికి అవకాశం కల్పిస్తూ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతిరోజూ కుట్టు కేంద్రాలను ఏపీఎం, సీసీలు పర్యవేక్షిస్తూ సకాలంలో పూర్తయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, అదనపు సంచాలకుడు రామకృష్ణ, సెర్ప్ అధికారులున్నారు.

తూకం.. జాప్యం



ఎల్కపల్లి కేంద్రంలో పేరుకుపోయిన రైతులు తెచ్చిన ధాన్యం

ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పెంచికల్‌పేట గ్రామానికి చెందిన జునుగరి వెంకన్న. తనకున్న ఐదెకరాల్లో వరి సాగు చేశాడు. 15 రోజుల క్రితం కోత పూర్తి చేశాడు. సుమారు



400 బస్తాల ధాన్యం రాగా విక్రయించటానికి 12 రోజుల క్రితం ఎల్కపల్లి కొనుగోలు కేంద్రానికి తెచ్చాడు. ధాన్యంలో తాలు ఉందని నిర్వాహకులు కొనుగోలు చేయలేదు. దీంతో ధాన్యం తూర్పార బట్టి తాలు తొలగించాడు. 10రోజులుగా కొనుగోలు కేంద్రంలోనే పడిగాపులు కాస్తున్నాడు.

- పుంజుకోని ధాన్యం కొనుగోళ్లు
- కేంద్రాల్లో అన్నదాతల నిరీక్షణ
- అకాల వర్షాలతో ఆందోళన
- జిల్లా వ్యాప్తంగా 37 కేంద్రాలు
- 4,697 మెట్రిక్ టన్నులే సేకరణ

పెంచికల్‌పేట్(సిర్పూర్): వరి ధాన్యం విక్రయించేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. రోజుల తరబడి మండుతున్న ఎండల్లో కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. లారీలు, హమాలీలు, గన్నీ సంచుల కొరత కారణంగా పలుచోట్ల కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 50వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ సీజన్‌లో 46వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటికీ 795 మంది రైతుల నుంచి 4,697 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారు. మరో 10రోజుల్లో యాసంగి ముగియనున్న నేపథ్యంలో కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

15రోజుల క్రితం ప్రారంభమైనా..

యాసంగిలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయటానికి జిల్లా వ్యాప్తంగా 37 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో ఐకేపీ ద్వారా నాలుగు, పీఏసీఎస్ ద్వారా 22 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు చేపట్టారు. రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నారు. జిల్లాలో 15రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా నేటికీ ఊపందుకోలేదు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో కొన్నిచోట్ల హమాలీలు రాత్రిపూట మాత్రమే తూకం వేస్తున్నారు. లారీలు సకాలంలో రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులకు పడిగాపులు తప్పడం లేదు. సేకరించిన ధాన్యానికి మూడు రోజుల్లో నగదు చెల్లించాల్సి ఉండగా జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు 316 మంది రైతుల ఖాతాల్లో రూ.4కోట్లు మాత్రమే జమ చేశారు.

రోజుల తరబడి కేంద్రాల్లోనే..

మరో 10రోజుల్లో యాసంగి ముగియనున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాకపోవడంతో అన్నదాతలు హడలిపోతున్నారు. గత 15 రోజుల్లో నాలుగుసార్లు కురిసిన అకాల వర్షానికి వరి ధాన్యం కాపాడుకోవటానికి అనేక ఇబ్బందులు పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం ఆరబెడుతున్నా తేమ పేరిట నిర్వాహకులు కొర్రీలు పెడుతూ కాంటా పెట్టడంలేదని రైతులు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం కుప్పల వద్ద రోజుల తరబడి కాపలా ఉంటున్నామని వారు ఆవేదన చెందుతున్నారు.

పదిరోజులుగా కల్లంలోనే..



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి పది రోజులైంది. ఎండకు అరబెట్టినా ఇంకా కాంటా పెడత లేరు. ప్రతిరోజూ కుప్పల వద్ద కావలా కాస్తున్న. ఆకాశంలో మబ్బులు కనిపిస్తుండగా సాయంత్రం కుప్పలుగా చేసి ఉదయం తిరిగి ఆరబెడుతున్న. అధికారులు ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు చేయాలె.

– భుక్య జీవన, మహిళా రైతు, ఎల్కపల్లి

వేగంగా కొంటలేరు



కౌటాల: నాలుగెకరాల్లో వరి వేసిన. 100 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వారం క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన. అధికారులు టోకెన్, సంచులు ఇవ్వలేదు. వాన పడితే ధాన్యం తడిసిపోతదని భయమైతంది. తేమ పేరిట అధికారులు, మిల్లర్లు క్వింటాల్‌కు 15కిలోల దాకా కటింగ్ పెడుతున్నరు.

– బోయర్ ఆనంద్‌రావు, రైతు సాండ్‌గాం

వేగవంతం చేస్తాం

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ వేగవంతం చేస్తాం. హమాలీల కొరతతో అక్కడక్కడా కొనుగోళ్లలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తూ నిర్వాహకులకు సూచనలు చేస్తున్నాం. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. కేంద్రాలకు తెచ్చిన ప్రతీ గింజ సేకరిస్తాం.

– వెంకటనరసింహారావు, డీసీఎస్‌వో

నకిలీ విత్తనాల బారిన పడొద్దు

- ఎస్పీ సురేశ్‌కుమార్
- విత్తన డీలర్లు, వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

కాగజ్‌నగర్ రూరల్: రైతులు నకిలీ విత్తనాల బారినపడొద్దని ఎస్పీ సురేశ్‌కుమార్ సూచించారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. శనివారం పట్టణంలోని వినయ్‌గార్డెన్స్‌లో విత్తన డీలర్లు, వ్యవసాయశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోకుండా వ్యవసాయశాఖ పర్యవేక్షణలో నాణ్యమైన విత్తనాలనే అందించాలని సూచించారు. నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, నిషేధిత పురుగుల మందులు అమ్మితే సహించేదిలేదని, పీడీ యాక్టు నమోదు చేయడంతోపాటు కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ, కల్తీ విత్తనాల రవాణా, విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ, విత్తన కార్పొరేషన్, పోలీస్ బలగాలతో జాయింట్ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని, ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ విత్తనాల పేరిట నాసిరకం, నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టి మోసం చేస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు నకిలీ విత్తనాలు రాకుండా ఇప్పటికే సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయాధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విత్తనాలు, ఎరువులు విక్రయించాలని సూచించారు. విత్తనాలు, ఎరువుల నిల్వల వివరాలు రోజువారీగా రిజిష్టర్‌లో పొందుపర్చాలని పేర్కొన్నారు. రైతులు విత్తనాల ఖాళీ సంచులను పంటకాలం పూర్తయ్యే దాకా భద్రపర్చుకోవాలని సూచించారు. ఒకవేళ రైతు నష్టపోతే ఆయా కంపెనీల నుంచి పరిహారం పొందే అవకాశముంటుందని తెలిపారు. కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని సీఐలు, వ్యవసాయశాఖ అధికారులు, డీలర్లు, ఫర్టిలైజర్‌షాపు యజమానులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వ్యవసాయశాఖ అధికారులు, విత్తన డీలర్లు

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

పెంచికల్‌పేట్: యాసంగిలో రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణుబాబు పేర్కొన్నారు. మండలంలోని ఎల్లూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ప్రతీ సంచికి అదనంగా ఒక కిలో ధాన్యం సేకరిస్తున్నారని రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. 15రోజుల నుంచి ధాన్యం విక్రయించటానికి పడిగాపులు కాస్తున్నా కేంద్రం ఇన్‌చార్జి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రైతుల తెచ్చిన ధాన్యం తేమ శాతం పరిశీలించారు. వెంటనే కాంటా పెట్టాలని సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రంలో విధులను నిర్లక్ష్యం చేసిన వెంకటేశ్వర్‌గౌడ్‌ను కేంద్రం ఇన్‌చార్జి విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. రైతులు కొనుగోలు కేంద్రంలో ఇబ్బందులుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట డీసీఎస్‌వో వెంకటనరసింహారావు, రైతులున్నారు.



ఎల్లూర్‌లో మాట్లాడుతున్న వేణుబాబు

చట్టాలపై అవగాహన అవసరం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సునీత

రెబ్బెన: మహిళల రక్షణ కోసం ప్రభుత్వం కల్పించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీ టీం ఇన్‌చార్జి సునీత సూచించారు. మండలంలోని కైరిగాంలో ఉపాధిహామీ కూలీలకు షీ టీం సేవలతోపాటు, మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థినులు, ఉద్యోగాలు చేసే మహిళలకు పని ప్రదేశాల్లో పోకిరీల ఈవ్ టీజింగ్‌కు గురైతే వెంటనే షీ టీంను సంప్రదించాలని సూచించారు. భవిష్యత్‌లో మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడకుండా పోకిరీలకు తగిన బుద్ధి చెబుతామని చెప్పారు. మహిళల రక్షణ కోసమే షీ టీం పని చేస్తుందని తెలిపారు. షీ టీం సేవలు సద్వినియోగం చేసుకోవాలని, ఆపద సమయంలో తక్షణ సాయం కోసం 'డయల్ 100'ను వినియోగించుకోవాలని సూచించారు. షీ టీం సభ్యులు శ్రీలత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేయొద్దు

- జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి
- నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డు పరిశీలన

కాగజ్‌నగర్ రూరల్: విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి హెచ్చరించారు. శనివారం మండలంలోని వంజీరి గ్రామంలోని నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డు, పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీల్లో మొక్కల పెంపకంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వానాకాలం సమీపిస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో గౌరీశంకర్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి

కౌటాల: నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా చూడాలని డీపీవో భిక్షపతి సూచించారు. మండల కేంద్రంలోని నర్సరీ, ప్రకృతి వనం, డంప్‌యార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లోని నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వానాకాలంలో హరితహారం కింద నాటడానికి మొక్కలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో చెత్త సేకరించి డంప్‌యార్డుకు తరలించాలని, చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డీఎల్పీవో సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ రూరల్: సెగ్రిగేషన్ షెడ్డు పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి

మాఫియా గుప్పిట్లో కాగజ్‌నగర్!

- అక్రమ దందాలకు అడ్డాగా..
- రవాణా మార్గాలే కీలకంగా..
- పెట్రేగుతున్న అక్రమార్కులు

చింతలమానెపల్లి/కౌటాల: అయితే గుట్కా.. లేదంటే మద్యం.. కాకుంటే పీడీఎస్ బియ్యం.. ఈ అక్రమ దందాలతో కాగజ్‌నగర్ నియోజకవర్గం మాఫియాలకు అడ్డాగా మారుతోంది. నియోజకవర్గం మహారాష్ట్రకు, తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దుగా ఉంది. నియోజకవర్గంలో ఏడు మండలాలుండగా వీటిలో కాగజ్‌నగర్ మినహా అన్ని మండలాలు మహారాష్ట్ర సరిహద్దును కలిగి ఉన్నాయి. సిర్పూర్(టి), చింతలమానెపల్లి మండలాల నుంచి మహారాష్ట్రకు రోడ్డు మార్గం ఉండగా, కాగజ్‌నగర్, సిర్పూర్(టి) మీదుగా మహారాష్ట్రకు రైలు మార్గం ఉంది. కాగజ్‌నగర్ పట్టణం సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాం గ్రామీణ మండలాలు నియోజకవర్గంలో ఉన్నాయి. ఇక్కడ అక్రమ మద్యం, దేశీదారు, కల్తీ మద్యం, బెల్ట్ దుకాణాలు, మద్యం ధరల పెంపు, మద్యం దుకాణాల సిండికేట్, భూదందాలు, అక్రమ మైనింగ్, నకిలీ విత్తనాలు, రేషన్ బియ్యం అక్రమంగా తరలింపు, బియ్యం గోల్‌మాల్, బెట్టింగ్.. ఇలా అక్రమంగా ఆదాయం పొందేందుకు అవకాశాలను అక్రమార్కులు వినియోగించుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తే కాగజ్‌నగర్ మాఫియాల గుప్పిట్లోకి వెళ్తోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమ మైనింగ్.. ఇసుక వ్యాపారం

కౌటాల మండలం ముత్తంపేటలో భారీగా నిర్వహిస్తున్న కంకర రాయి తవ్వకాలు అక్రమ మైనింగ్‌తో పలు మండలాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. టిప్పర్లలో మహారాష్ట్రకు అక్రమంగా పెద్ద మొత్తంలో తరలిస్తున్న క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు మృత్యువాత పడ్డారు. కౌటాల, చింతలమానెపల్లి, సిర్పూర్(టి) మండలాల్లో రహదారులు ధ్వంసమయ్యాయి. ముత్తంపేట సమీపంలో ఐదు కంకర క్వారీలు ఏర్పాటు చేయడం అక్రమార్జనకు నిదర్శనం. దీనికి తోడు కాగజ్‌నగర్ సమీపంలోని పెద్దవాగు, దహెగాం మండలంలోని వాగుల్లో నిర్వహిస్తున్న ఇసుక తవ్వకాలు, గ్రామగ్రామాన మట్టి తవ్వకాలు నిబంధనలు ఉల్లంఘించి మరీ నిర్వహిస్తున్నారు.

ఇటీవలి ఘటనలు..


- కాగజ్‌నగర్ పట్టణ శివారులో చేపట్టిన మైనింగ్‌లో అక్రమాలను వెలికి తీసేందుకు ప్రయత్నించిన ఓ పత్రికావిలేకరిపై సదరు నిర్వాహకులు దాడికి పాల్పడ్డారు. దీంతో విలేకరుల సంఘాలవారు మైనింగ్ ఉన్నతాధికారులు, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.
- చింతలమానెపల్లి మండలం గూడెంలో నకిలీ విత్తనాలు చేరవేస్తున్న నలుగురిని జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. రూ.1.50లక్షల విలువైన విత్తనాలు స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. మహారాష్ట్రలోని అహేరితో సంబంధాలుండి బెజ్జూర్ మండలం సోమినిలో మరిన్ని నకిలీవిత్తనాలు పట్టుబడ్డాయి.
- సిర్పూర్(టి) మండలంలోని రైస్‌మిల్లులో ఇటీవల జరిగిన దాడుల్లో బియ్యం గోల్‌మాల్ అయినట్లు వెల్లడైంది. తనిఖీల్లో రూ.కోట్ల అవినీతి చోటు చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు.
- ఎన్నికల సందర్భంగా బెజ్జూర్ మండల కేంద్రంలోని మద్యం దుకాణంలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. తనిఖీలు నిర్వహించిన అధికారులకు మద్యం అధిక ధరలకు విక్రయిస్తూ పట్టుబడడంతో దుకాణాన్ని సీజ్ చేశారు.

అక్కడ నిషేధం.. ఇక్కడ ఆదాయ మార్గం

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మద్య నిషేధం అమలులో ఉంది. దీంతో మద్యం వ్యాపారులు జిల్లా నుంచి గడ్చిరోలి జిల్లాకు మద్యం సరఫరా చేసి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈక్రమంలో కాగజ్‌నగర్ పరిసరాల్లో గుట్టు చప్పుడు కాకుండా కల్తీ మద్యం తయారు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. మహారాష్ట్రలో గడ్డిమందుగా వినియోగించే గ్లైసిల్ రౌండప్ మందుపై నియంత్రణ ఉండగా తెలంగాణలో నిషేధం ఉంది. అక్కడి నుంచి అక్రమంగా జిల్లాలోకి వ్యాపారస్తులు తీసుకువచ్చి అమ్ముతున్నారు. గుజరాత్, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే బీటీ-3 పత్తి విత్తనాలు మహారాష్ట్ర మార్గాల నుంచే వస్తున్నాయని ఇటీవల కొన్ని ఘటనల్లో స్పష్టమైంది. పోలీసులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. అయినా రోజురోజుకూ కేసులు పెరుగుతున్నాయి.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్ రూరల్: గుడిభూమి ఆక్రమణకు పాల్పడుతున్న వారికి సహకరిస్తున్న అధికారులపై వెంటనే చర్య తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ, భజరంగ్‌దళ్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మండలంలోని జగన్నాథ్‌పూర్ శివారులోని భీమన్న దేవాలయానికి సంబంధించిన అసైన్డ్ భూమిని రషీద్ అనే వ్యక్తి అక్రమంగా కబ్జా చేయడానికి చూస్తున్నాడని ఆరోపించారు. తహసీల్దార్, ఆర్డీవోతో కుమ్మక్కై, తనకున్న నాలుగెకరాల భూమి కాకుండా 10 ఎకరాలు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడని తెలిపారు. దీనిపై భజరంగ్‌దళ్ నాయకులు ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించగా, కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు వారిని దుర్భాషలాడి బెదిరించారని ఆరోపించారు. భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ శివాగౌడ్ మాట్లాడుతూ.. భూఆక్రమణకు పాల్పడుతున్న వారికి వత్తాసు పలుకుతున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టర్, ఎస్పీ చొరవ తీసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, నియోజకవర్గ కన్వీనర్ వీరభద్రాచారి, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయా, పట్టణాధ్యక్షులు సిందం శ్రీనివాస్, విజయ్, కోనేరు సీతారాం, శ్రీనివాస్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

క్లుప్తంగా

పురుగుల మందుతాగి ఆత్మహత్య


సురేశ్ (ఫైల్)

కోటపల్లి: పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పార్పల్లి గ్రామానికి చెందిన నామని సురేశ్ (42) కొంతకాలంగా మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా ఖాళీగా తిరుగుతుండేవాడు. శనివారం ఇంట్లో పురుగుల మందు తాగడంతో అతని భార్య రజిత గమనించి 108కు సమాచారం అందించింది. ముందుగా చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం మంచిర్యాల ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై కాంతారావు తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య

కౌటాల: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముత్తంపేటకు చెందిన కారెం పెంటు (64) శనివారం మధ్యాహ్నం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై ఎస్.మధుకర్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిర్పూర్(టి)సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వృద్ధుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

కోర్సినిలో ఒకరు దారుణహత్య

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోర్సినిలో శుక్రవారం రాత్రి ఒకరు దారుణహత్యకు గురైనట్లు ఎస్సై నరేష్ తెలిపారు. గ్రామంలో కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న బొట్టుపల్లి సదయ్య (34) శుక్రవారం రాత్రి గ్రామంలోని ముల్కల రాజ్‌కుమార్ ఇంటికి వెళ్లగా ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈక్రమంలో రాజ్‌కుమార్ ఇనుప పైపుతో తలపై కొట్టగా సదయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి బొట్టుపల్లి మల్లక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీసీలకు అవకాశం ఇవ్వాలి

పాతమంచిర్యాల: తెలంగాణ ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే యూనివర్సిటీ ఉపకులపతుల పోస్టులలో బీసీలకు అవకాశం కల్పించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు వెంకటయ్య, మామిడిశెట్టి వెంకటేష్, రాజు, చంద్రమౌళి, సతీష్, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని శ్రీషైన్ ఆస్పత్రి వద్ద శుక్రవారం రాత్రి ఫర్నీచర్ విషయంలో డాక్టర్ నవ్య, స్థానిక నివాసి శ్రీనివాస్ మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్సైలు సోనియా, అంజన్న సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు. డాక్టర్ నవ్యకు తలకు గాయం కావడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇరువురి ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని రూరల్ సీఐ అల్లం రాంబాబు తెలిపారు.

కార్మికవాడలకు కలుషిత నీరు


రామాలయం ఫిల్టర్ బెడ్

- పట్టించుకోని సింగరేణి అధికారులు
- ఆందోళనలో కార్మిక కుటుంబాలు

బెల్లంపల్లి: పట్టణంలోని కార్మిక వాడలకు మౌలిక సదుపాయాల కల్పనలో చూపిస్తున్న నిర్లక్ష్యం తాగునీటి సరఫరాలోనూ కనిపిస్తోంది. ఫలితంగా ప్రతీ వేసవి సీజన్‌లో కార్మిక కుటుంబాలు తాగునీటి కష్టాలు అనుభవిస్తున్నాయి. నాలుగైదు రోజులకోసారి అతికష్టం మీద నీటిని వదులుతుండడంతో మెజార్టీ కార్మికవాడలు నీటిగోసను అనుభవిస్తున్నాయి. శుక్రవారం బొగ్గు, ఆయిల్‌తో ఉన్న నీటిని సరఫరా చేయడం కలకలం రేపింది. ఈ నీటిని మరుగుదొడ్లు, మూత్రశాలలకు వినియోగించడానికి తప్ప మరెందుకు పనికి రాదని కార్మికులు పేర్కొంటున్నారు. నల్లని రంగుతో సరఫరా అవుతున్న నీటిని కార్మిక కుటుంబాలు, కార్మికేతరులు తాగలేక గొంతు తడుపుకునేందుకు అనివార్యంగా వాటర్ క్యాన్‌లను కొనుగోలు చేసి అవసరాలు తీర్చుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. బెల్లంపల్లిలో బొగ్గు గనులు మూతబడి, విభాగాలు ఎత్తివేతకు గురికావడంతో పాటు ఎంపిక చేసిన ప్రాంతాల్లోని కంపెనీ క్వార్టర్లను, ఖాళీ స్థలాలను ప్రభుత్వానికి అప్పగించడంతో ఆయా అంశాల పట్ల సింగరేణి అధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదని తెలుస్తోంది.


కార్మికవాడలకు సరఫరా అయిన తాగునీరు

మొక్కుబడిగా శుద్ధిచేసి..

గోదావరి జలాలు ఆశాజనకంగా సరఫరా కాకపోవడంతో ప్రత్యామ్నాయంగా శాంతిఖని గని నీటిని సరఫరా చేయడానికి అధికారులు సిద్ధపడ్డారు. గని భూగర్భంలో యంత్రాల ద్వారా బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. యంత్రాలకు వినియోగించిన గ్రీస్, ఆయిల్ నీటిలో కలిసి పోతుంది. ఆ నీటిని భూగర్భం నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా గని ఉపరితలానికి తీసుకువచ్చిన తర్వాత సమీపంలోనే ఉన్న శాంతిఖని ఫిల్టర్ బెడ్‌లో శుద్ధిచేసి సరఫరా చేయాల్సి ఉండగా ఈ తీరుగా వ్యవహరించడం లేదు. ఫిల్టర్ బెడ్‌ల పర్యవేక్షణ కూడా సరిగా చేపట్టడం లేదు. దీంతో సక్రమంగా నీటి శుద్ధిచేయకుండానే కార్మిక వాడలకు వదులుతున్నారు. ఆ నీటిని అనివార్యంగా కార్మికులు తాగాల్సిన దుస్థితి వస్తున్నా సింగరేణి కార్మిక సంఘాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఏఐటీయూసీ ఎర్ర జెండా సంఘం పోరాట పటిమను కోల్పోయి కార్మిక సమస్యలపై సరిగా స్పందించడం లేదనే విమర్శలను మూట గట్టుకుంటోంది. మిగిలిన ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్, ఇతర సంఘాలు పత్రికా ప్రకటనలకే పరిమితమవుతున్నాయని కార్మికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రధాన కార్మిక సంఘాలు తాగునీటి సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయాన్ని 'సాక్షి' సింగరేణి సివిల్ విభాగం బెల్లంపల్లి ఇన్‌చార్జి సతీష్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

గోదావరి నీళ్లు రావు.. వచ్చినా వదలరు

కార్మికవాడలకు గోదావరి జలాల సరఫరా సరిగా కానరావడం లేదు. సీసీసీ ఇంటెక్ వెల్ నుంచి మందమర్రి ఫిల్టర్ బెడ్‌కు గోదావరి నీటిని సరఫరా చేసి అక్కడ ఫిల్టర్ చేసిన తర్వాత బెల్లంపల్లికి సరఫరా చేయాల్సి ఉండగా సక్రమంగా అమలు చేయడం లేదు. మందమర్రిలోని కార్మిక వాడలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి అక్కడ పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరిగాక మిగిలిన కొద్దిపాటి నీటిని బెల్లంపల్లికి వదిలిపెడుతున్నట్లు చెబుతున్నారు. ఆ కొద్దిపాటి గోదావరి నీటిని స్టేషన్‌రోడ్ కాలనీ, అధికారులు నివాసం ఉంటున్న ఏఎంసీ ఏరియాలకు సరఫరా చేసి మిగతా ప్రాంతాలపై పక్షపాత వైఖరి అవలంభిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

పొద్దంతా రెక్కీ.. రాత్రంతా చోరీ


వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాసులు

- ఏడుగురు సభ్యులున్న దొంగల ముఠా అరెస్టు
- రూ.11.72 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తుల్లా పొద్దంతా కాలనీల్లో సంచరిస్తూ రెక్కీ నిర్వహించడం, తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తూ రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగల ముఠాను ఎట్టకేలకూ మంచిర్యాల పోలీసులు పట్టుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు స్థానిక ఎం.కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో ఏడుగురు ముఠాగా ఏర్పడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలోని మంచిర్యాల, హాజీపూర్, సీసీసీ నస్పూర్, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, మందమర్రి పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడుతున్నారు. చోరీ చేసిన సొత్తును శనివారం ముఠా సభ్యుడైన గన్నారం మధుకర్ ద్వారా కరీంనగర్‌లో విక్రయించేందుకు మరో సభ్యుడు స్థానిక గాంధీనగర్‌కు చెందిన తాటికొండ స్వామిచరణ్ ఇంటివద్ద సభ్యులంతా కలిసి సమావేశమయ్యారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించిన పోలీసులు వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.9.22 లక్షల విలువైన బంగారు, రూ.60 వేల విలువైన వెండి ఆభరణాలు, బైక్, రూ.1.20 లక్షల విలువైన ఎల్ఈడీ హోంథియేటర్, రూ.20 వేల విలువైన గిటార్ స్వాధీనం చేసుకున్నారు.

అంతా 22 ఏళ్ల లోపువారే...

సీసీసీ ప్రశాంత్ నగర్‌కు చెందిన పాగిడి కార్తీక్ (19), జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన తాటికొండ స్వామిచరణ్ (19), బెల్లంపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పుప్పాల రాహుల్ (19), నస్పూర్ మండలం సుందరయ్య కాలనీకి చెందిన గన్నారం మధుకర్ (20), కుమురంభీం జిల్లా కాసిపేట మండలానికి చెందిన కుర్సింగ ఈశ్వర్ (20), తిర్యాణికి చెందిన మడావి రాము (22), తిర్యాణి మండలం కన్నెపెల్లికి చెందిన వెడ్మ ప్రవీణ్(22)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ వెల్లడించారు. ముఠాను అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ బన్సీలాల్, సహకరించిన స్పెషల్ పార్టీ సిబ్బంది, ఎస్సైలను సీపీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు. సమావేశంలో స్థానిక ఏసీపీ ప్రకాష్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రూప్ 1, 2 గ్రాండ్ టెస్ట్

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న గోల్కొండ అకాడమి ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2 గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు సైదులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షకు గంట ముందుగా హాజరై కళాశాలలో సత్యనారాయణను సంప్రదించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న కార్మికులు

కాసిపేట: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కాసిపేట–2 గని కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ మ్యాన్‌రైడింగ్‌ను వెంటనే ప్రారంభించాలని, కొత్త ఎస్‌డీఎల్ యంత్రాలు తెప్పించాలని, మైనింగ్ సర్దార్‌లను నియమించాలని, గనిలో నార్త్‌లో వెంటిలేషన్ మెరుగుపర్చాలని, పర్మినెంట్ స్కావెంజర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని గ్రూపు ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ ఎండీ అక్బర్‌అలీ, బెల్లంపల్లి బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేశ్, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, రామకృష్ణాపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు లింగయ్య, పిట్ సెక్రెటరీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'రెస్ట్‌హాల్ ఏర్పాటు చేయాలి'


కార్మికులలో మాట్లాడుతున్న జెట్టి శంకర్‌రావు

శ్రీరాంపూర్: ఏరియా వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక రెస్ట్‌హాల్ ఏర్పాటు చేయాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం వర్క్‌షాప్‌ను సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీజీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టాలని, వర్క్‌షాప్ డ్రైవర్లకు ష్లేడేలు కల్పించాలని, నాణ్యమైన పనిముట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, కార్యదర్శి బ్రహ్మచారి, ఏరియా కార్యదర్శులు వెంకటేశ్వర్లు, గణపతి, వెంకటస్వామి, నీలం సదయ్య, నాయకులు మోహన్, మహేష్, రామస్వామి, పిట్ సెక్రెటరీ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ సమావేశాన్ని బహిష్కరించిన ఏఐటీయూసీ


సమావేశాన్ని బహిష్కరించిన నేతలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో శనివారం అధికారులు నిర్వహించిన సేఫ్టీ సమావేశాన్ని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు బహిష్కరించారు. డీజీఎం వైఖరికి నిరసనగా ఆ యూనియన్ బ్రాంచి సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య ఆధ్వర్యంలో నాయకులు సమావేశాన్ని బహిష్కరించి బయటికి వచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీహెచ్‌పీలో రక్షణ సూత్రాలను పాటించడంలేదన్నారు. కార్మికులు రక్షణ ఏర్పాటు చేయాలని అడిగితే వారిపై అధికారులు, డీజీఎం కలిసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. గత సేఫ్టీ సమావేశాల్లో సూచించిన అంశాలను, సమస్యలను పరిగణలోకి తీసుకోలేదని, అందుకే సమావేశాన్ని బహిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, పిట్ సెక్రెటరీ చర్ల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌పై చర్యలకు కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టరేట్‌కు వచ్చిన వీఆర్ఏ, వీఆర్వోలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జాబ్ చార్ట్‌కు విరుద్ధంగా పనులు చేయిస్తున్న క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని శనివారం వీర్వోలు, వీఆర్ఏలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నాయకులు స్వామిదాస్, డి.శ్రీనివాస్ మాట్లాడుతూ వీఆర్వో, వీఆర్ఏలకు జూనియర్ అసిస్టెంట్ హోదా లేదా తత్సమానమైన హోదాతో పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వగా ఇందుకు విరుద్ధంగా స్లీపర్ పనులు చేయిస్తున్నారని వాపోయారు. వారం రోజులుగా ఉపాధి కూలీలు పనిచేసే హరితహారంకు సంబంధించిన పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'ముస్లింలను ఓబీసీలో కలిపితే సహించేదిలేదు'

చెన్నూర్: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ముస్లింలకు ఓబీసీ రిజర్వేషన్ కల్పిస్తానని ప్రకటించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపాక చారి అన్నారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు జాడి తిరుపతి, రాపర్తి వెంకటేశ్వర్, కమ్మల శ్రీనివాస్, గర్రెపల్లి నర్సయ్య, తుమ్మ శ్రీపాల్, శివకృష్ణ పాల్గొన్నారు.

చిన్నారికి రక్తమార్పిడి


శిశువుతో మధుసూదన్‌రెడ్డి

మంచిర్యాలటౌన్: జన్నారంలో చెత్తకుండీలో పడేసిన శిశువును బాలల సంరక్షణ అధికారులకు అప్పగించగా మంచిర్యాలలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. చిన్నారి శరీరంలో రక్తం తక్కువగా ఉండడంతో ఉమెన్ అండ్ చైల్డ్ జిల్లా కోఆర్డినేటర్ ప్రేమ ద్వారా రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి శిశువుకు అవసరమైన గ్రూప్ రక్తాన్ని ఉచితంగా అందజేశారు. రక్తమార్పిడి తర్వాత మాతాశిశు కేంద్రానికి వెళ్లి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.

నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం


విత్తనాలు, నిందితుడితో ఏవో, పోలీసులు

నెన్నెల: మండలంలోని బొప్పారం స్టేజ్ వద్ద శనివారం 20 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వ్యవసాయ, పోలీసు సిబ్బందితో గ్రామంలో తనిఖీ కోసం వెళ్తుండగా బొప్పారం స్టేజీ వద్ద నారా పురుషోత్తం అనుమానాస్పదంగా కనిపించడంతో అతన్ని తనిఖీ చేయగా 20 కిలోల లూజ్ పత్తి విత్తనాలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడుల్లో పోలీసు సిబ్బంది అనంత్, హోంగార్డు రామరాజు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

విద్యుత్‌కోతలతో దహన సంస్కారాలకు ఇక్కట్లు


'మిషన్' నీటితో స్నానం చేస్తున్న బంధువులు

భీమారం: మండల కేంద్రానికి చెందిన శంకరమ్మ అనే మహిళ శనివారం మృతి చెందగా భౌతిక కాయాన్ని గ్రామ పొలిమేరలోని అటవీ ప్రాంతానికి తరలించారు. సమీపంలోని రైతువేదిక వద్ద గల బోరుబావి ద్వారా నీటిని తరలించి కార్యక్రమం పూర్తి చేసేందుకు బంధువులు సిద్ధపడ్డారు. మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ సిబ్బంది గ్రామానికి వెళ్లి మినరల్ వాటర్ కొనుగోలు చేసి తీసుకొచ్చి కార్యక్రమం పూర్తి చేశారు. అయితే మినరల్ వాటర్ అందకపోవడంతో గ్రామ పొలిమేరలో మిషన్ భగీరథ పంపువద్ద స్నానాలు ఆచరించారు.

సమస్యలు పరిష్కరించాలని సీఎండీకి వినతి


వినతిపత్రం ఇస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డీ.బ్రహ్మానందం శనివారం సీఎండీ బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కోల్ సెక్టార్ సిస్టం లేదా ఫ్యాక్టరీ యాక్ట్ సిస్టం పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో కాంట్రాక్ట్ కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. చట్టబద్ధంగా రావాలిసిన హక్కులు, సౌకర్యాలు అమలు కావడం లేదన్నారు. హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని, లీవులు, పండుగ మస్టర్లు. ఇతర అలవెన్స్‌లు కల్పించాలని, ఇంకా ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.

నగల వ్యాపారులు ఒత్తిడికి గురికావొద్దు


మాట్లాడుతున్న బ్రహ్మయ్య

పాతమంచిర్యాల: బంగారు నగల వ్యాపారులు ఎలాంటి ఆందోళన, ఒత్తిడికి గురికావొద్దని స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీఎంఏ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొంగ బంగారం కొనుగోలు చేసి ఇబ్బందులపాలు కావద్దన్నారు. యధావిధిగా దుకాణాలు తెరిచి పనులు చేసుకోవాలన్నారు. తమకు చట్టం అన్నా పోలీసులన్నా గౌరవం ఉందని, దొంగ బంగారం కొనుగోలు చేసినట్లు అనుమానం ఉంటే సీఆర్‌పీ 41 నోటీసులు జారీ చేసి విచారణకు పిలవాలన్నారు. స్వర్ణకారుల సమస్యలపై ముఖ్యమంత్రి, డీజీపీ, కేంద్ర మంత్రులను కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. సమావేశంలో స్వర్ణకారుల సంఘం రాష్ట్ర నాయకులు కన్నెకంటి సత్యం, ఎర్రోజు వేణుగోపాల్, వెంకటాచారి, నర్సింహాచారి, మంచిర్యాల బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీపాద రవి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలు అడ్డగింత


తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

దండేపల్లి: మండలంలోని అల్లీపూర్ ఊర చెరువులో చేపట్టిన మట్టి తవ్వకాలను శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. చెరువులో వెయ్యి మెట్రిక్ టన్నుల మట్టి తవ్వుకునేందుకు ఓ వ్యక్తి మైనింగ్, ఇరిగేషన్ శాఖల నుంచి అనుమతి పొందాడు. శుక్రవారం పూర్తి కావడంతో తవ్వకాలను నిలిపి వేయాలని సంబంధింత అధికారులు సూచించారు. అయినప్పటికీ తవ్వకాలు జరుపుతుండగా గ్రామస్తులు అడ్డుకుని అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ విజయభాస్కర్‌ను ఫోన్లో సంప్రదించగా అనుమతి ప్రకారం వెయ్యి మెట్రిక్ టన్నులు పూర్తి కావడంతో తవ్వకాలు నిలిపి వేయాలని సూచించామన్నారు.

రైస్‌మిల్లును తనిఖీ చేసిన ఆర్డీవో


రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న ఆర్డీవో హరికృష్ణ

నెన్నెల: మండలంలోని నందులపల్లి గ్రామ శివారులో ఉన్న శ్రీలక్ష్మీ శ్రీనివాస రైస్‌మిల్లులో ధాన్యం దిగుమతి ప్రక్రియను శనివారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ తనిఖీ చేశారు. రైస్ మిల్లర్లు ధాన్యం అన్‌లోడింగ్ వేగవంతంగా పూర్తి చేయాలని, ధాన్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని, మిల్లుల వద్ద ఎలాంటి కోత విధించకూడదని యాజమాన్యానికి సూచించారు. మిల్లులకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సబ్బ రమేశ్, తదితరులు ఉన్నారు.

నమ్మించి దోపిడీ చేశారు..

కాగజ్‌నగర్ రూరల్: ఓ మహిళను మాయమాటలతో నమ్మించి దోపిడి చేసిన సంఘటన శనివారం రాత్రి కాగజ్‌నగర్‌లో చోటు చేసుకుంది. పట్టణంలోని పెద్దవాగు రోడ్డుకు చెందిన బిజిలి అచ్చమ్మ తన మనుమరాలు కీర్తనతో ఖమ్మం నుంచి శనివారం రాత్రి కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. వారిని గమనించిన ఇద్దరు దుండగులు మాటల్లో పెట్టి రైల్వేపట్టాలు దాటిస్తామని రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి వరకు తీసుకెళ్లి దాడికి పాల్పడ్డారు. మహిళ మెడలోని రెండున్నర తులాల బంగారు చైన్, పర్సులోని రూ.6 వేల నగదు అపహరించారు. ఇద్దరూ గట్టిగా అరవడంతో పరారయ్యారు. రైల్వేశాఖ పోలీసులతో పాటు సీఐ శంకరయ్యకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది.